
నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 31 జనవరి 2025
YADADRI BHUVANAGIRI



దేవరకొండలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

## పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి : కలెక్టర్



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట, జనవరి 30 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, భోజనశాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు వచ్చేలా సాధన చేయించే దిశగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. సమయ పాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కిచెన్ షెడ్డు లేకపోవడంతో పంచాయతీరాజ్ ఏఈకి ఫోన్ చేసి వెంటనే కిచెన్ షెడ్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు షీబా, జ్యోతి, శంకరయ్య, సుజాత పాల్గొన్నారు.

# బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- 420 రోజులు దాటినా హామీల అమలేది?
- అబద్ధాలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ నేతలు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- దేవరకొండలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

చందంపేట(దేవరకొండ), జనవరి 30 : అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని, పాలనా పగ్గాలు చేపట్టి 420 రోజులు దాటినా హామీలు అమలు చేయడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు దేవరకొండ పట్టణంలోని గాంధీ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి పూలమాలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు, ఫోర్ ట్వంటీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అమలును మాత్రం విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ నేతలంతా అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. 2021లోనే గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రేషన్ కార్డుల కార్యక్రమంలో బట్టి విక్రమార్క పాల్గొన్నట్లు గుర్తు చేశారు. కుటుంబానికి 20 కేజీలుగా ఉన్న బియ్యం పరిమితిని బీఆర్‌ఎస్ సర్కారు ఎత్తివేసి ఎంత మంది ఉంటే అంత మందికి 6 కేజీల చొప్పున ఇచ్చిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 6,47,479 రేషన్ కార్డులు జారీ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు దాటుతున్నా నాలుగో వంతు ఉద్యోగాలు కూడా కల్పించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ రైతు భరోసాకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు అని ఇప్పుడు రైతు భరోసా రూ.12వేలు అనడం దుర్మార్గమన్నారు. అదికూడా సంక్రాంతికి ఇస్తామని ఒకసారి, జనవరి 26 అని మరోసారి మాట మార్చారని, ఇప్పుడు మళ్లీ మార్చి 31కి అంటున్నారని మండిపడ్డారు. హామీలపై గ్రామ సభల్లో ప్రశ్నించిన రైతులకు చెప్పడానికి ప్రభుత్వం దగ్గర సమాధానం లేకపోయిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గాజుల ఆంజనేయులు, టీవీఎన్ రెడ్డి, రవికుమార్, లోక్యానాయక్, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, రాజు, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



తుంగతుర్తి : గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్



సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

# కాంగ్రెస్ హామీలపై పోరుబాట

## బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రాలు



నకిరేకల్ : మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కదిలిన గులాబీ శ్రేణులు
- దేవరకొండలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్
- నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిరసన

యాదాద్రి భువనగిరి, నల్లగొండ ప్రతినిధి, జనవరి30 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలుపై బీఆర్‌ఎస్ పార్టీ యుద్ధం ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తికావస్తున్నా హామీల అమలేది అంటూ వినూత్నంగా నిరసనకు దిగింది. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీలు శ్రేణులు గురువారం కదం తొక్కాయి. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూనే... హామీలపై కాంగ్రెస్ మోసాన్ని ఆలకించాలని మహాత్ముడి విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. గాంధీ విగ్రహాలు ఉన్న ప్రతి చోటా నిరసన తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలతోపాటు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు గుర్తు చేశారు. ఏడాది పాలన పూర్తి చేసుకుని 420 రోజుల గడుస్తున్నా నేటికీ ఇచ్చిన హామీలన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తు చేసేందుకే గాంధీజీకి వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వినతిపత్రాల సమర్పణ కొనసాగింది. మండల కేంద్రాల్లోనూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ బూకటపు హామీలపై కదిలి నిరసన వ్యక్తం చేశాయి. దేవరకొండలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గాంధీకి ఘనంగా నివాళులు అర్పించి.. కాంగ్రెస్ మోసపూరిత హామీలపై వినతిపత్రాన్ని సమర్పించారు. కాంగ్రెస్ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నదని, ఇప్పుడు వాటి అమలుపై పోరాటం చేస్తుంటే బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులతో వేధిస్తున్నదని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసాలపై ప్రజల తిరుగుబాటు మొదలైందని, ప్రజా పోరాటంతోనే ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. మిర్యాలగూడలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చాయి. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీకి నివాళులు అర్పిస్తూ వినతిపత్రం అందజేశారు. నల్లగొండలోని గాంధీ పార్కులో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలపై వినతిపత్రం అందజేశారు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని నిరనసన తెలిపారు. సంస్థాన్‌నారాయణపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ పాల్గొని గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. తుంగతుర్తి నియోజవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం జరిగింది. ఇక్కడ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై వినతిపత్రం అందజేశారు. ఆత్మకూర్(ఎం)లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, భువనగిరి మండలంతాజ్‌పూర్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, కోదాడ, భువనగిరి, ఆలేరు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ముఖ్య నేతలంతా కలిసి గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. మండల కేంద్రాల్లోనూ నిరసన తెలిపారు. భువనగిరి పట్టణంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి నివాళులర్పించారు. ఆలేరు పట్టణం, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, రామన్నపేట, వలిగొండ, తుర్కపల్లి, గుండాల, మోటకొండూరులో మహాత్ముడి విగ్రహానికి వినతి పత్రాలు అందజేశారు.రానున్న కాలంలో ప్రభుత్వ వైఫల్యాలపై మరిన్ని ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా పార్టీ నేతలు స్పష్టం చేశారు.


# మోతె తాసీల్దార్, హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

- కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగింపు
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్న కలెక్టర్

సూర్యాపేట, జనవరి 30 : కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అక్రమంగా ఫౌతి చెసిన మోతె తాసీల్దార్ సంఘమిత్ర, గిరిజన వసతి గృహంలో విద్యార్థినుల అస్వస్థతను ఉన్నతాధికారులకు చెప్పకుండా దాచిన వార్డెన్ ఝాన్సీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మోతె తాసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజును విధుల నుంచి తొలగించారు. చివ్వెంల మండలం తిరుమలగిరికి చెందిన మట్టపల్లి వెంకటాచలానికి మోతె మండలం నామారంలో 7.10 ఎకరాల భూమి ఉంది. ఆయన మొదటి భార్య చనిపోవడంతో రెండో పెండ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు సైదమ్మ, రమణ అనే ఇద్దరు కూతుర్లు, రెండో భార్య పూలమ్మకు కుమారుడు రఘు ఉన్నారు. కొవిడ్ సమయంలో వెంకటాచలం చనిపోయారు. పూలమ్మ, తల్లి లింగమ్మతోపాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడి పేరుతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీయించారు. వెంకటాచలానికి చెందిన భూమి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మార్టిగేజ్ చేసి లోన్ తీసుకున్నారు. వీటిన్నింటినీ పక్కకు పెట్టి మొదటి భార్య కుమార్తెలు సైదమ్మ, రమణ పేరిట అక్రమంగా ఫౌతి చేశారని పూలమ్మ సూర్యాపేట ఆర్డీఓకు ఫిర్యాదు చేసింది. విచారణలో అక్రమంగా పట్టా చేశారని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించడంతో కలెక్టర్ గురువారం మోతె తాసీల్దార్ సంఘమిత్రను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో సహకరించిన కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజును పూర్తిగా విధుల నుంచి తొలగించారు. అంతకుముందు తాసీల్దార్ సంఘమిత్రను సస్పెండ్ చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి బాధితురాలు పూలమ్మ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అలాగే.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరినగర్‌లో ఉన్న గిరిజన బాలికల వతి గృహంలో విద్యార్థినుల అస్వస్థతకు గురికాగా ఉన్నతాధికారులకు తెలుపకుండా, వైద్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్ ఝాన్సీని కూడా సస్పెండ్ చేశారు. విద్యార్థినులను ప్రభుత్వ దవాఖానలో చేర్పించకుండా, ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించడంతో సరైన వైద్యం అందక ఆరోగ్యం క్షీణించిందని పేర్కొంటూ.. బాధ్యురాలైన వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



ఆత్మకూరు(ఎం) : మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు



భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

# యాదాద్రి ఎంఎంటీఎస్‌కు నిధులిచ్చేనా?




## ఏడేండ్లుగా నిధులలేమితో ఎక్కడి పనులక్కడే..

- రైల్వే ప్రాజెక్టులు ప్రతిపాదనలకే పరిమితం
- కలగానే ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ హామీ
- పత్తాలేని నవోదయ పాఠశాల, సీసీఎంబీ
- రేపు కేంద్ర బడ్జెట్

యాదాద్రి భువనగిరి, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎప్పుడూ నిరాశే ఎదురవుతున్నది. ఎన్నో ప్రతిపాదలు ఉన్నా కేంద్రం ఏ ఒక్కటీ ఇవ్వకుండా మొండి చెయ్యి చూపుతున్నది. ఏటా బడ్జెట్ సందర్భంగా ఆశగా ఎదురుచూడడం తప్ప ఫలితం ఉండడం లేదు. పలు ప్రాజెక్టులు, సంస్థలపై పెట్టుకున్న ఆశలు అడియాశలే అవుతున్నాయి. కొత్త రైల్వే లైన్లు పట్టాలెక్కడం లేదు. రైళ్ల హాల్టింగ్, స్టేషన్ల ఆధునీకరణ మోక్షం లభించడం లేదు. ఫిబ్రవరి ఒకటిన కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ఈసారైనా నిధులు ఇస్తారా, లేదా అని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**రైల్వేకు నిధుల కొరత..**

ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి (రాయగిరి) వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు కల నెరవేరడం లేదు. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు 38 కిలోమీటర్ల మేర ఎంఎంటీఎస్‌ను పొడిగించాల్సి ఉంటుంది. కానీ ఇందుకోసం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా, ఏండేండ్లుగా నిధుల లేమి వేటాడుతున్నది. దీన్ని సొంతంగా చేపడుతామని కేంద్రం అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. సికింద్రాబాద్–కాజీపేట మూడోలైన్‌కు కూడా నిధులు అవసరం. హైదరాబాద్ నుంచి విజయవాడకు హైస్పీడ్ రైలు నడుపాలనే ప్రతిపాదనలు ఉన్నా అడుగులు ముందుకు పడడం లేదు. పుష్‌పుల్ ట్రిప్పులు పెంచాలనే డిమాండ్ ఎన్నో ఏండ్ల నుంచి ఉంది. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, పలు రైళ్ల హాల్ట్‌ను పరిగణలోకి తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎన్ని వినతులు చేసినా పట్టించుకోవడం లేదు.

### ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ వచ్చేనా?

ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు ఉమ్మడి నల్లగొండ ప్రజల చిరకాలం స్వప్నం. గతంలోనే చౌటుప్పల్‌కు ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ మంజూరైంది. దాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌కు తరలించుకుపోయింది. ప్రయోగ కేంద్రం వస్తే అధ్యయనాలు జరుగుతాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయి. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ మంజూరు చేస్తామని బీజేపీ అగ్ర నేతలు, కేంద్ర మంత్రులు హామీలు ఇచ్చారు. కానీ అది ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. ప్రపంచంలో అత్యధికంగా ఫ్లోరైడ్ బాధితులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఉన్నా కనికరం లేకపోవడం బాధాకరం.

### పత్తాలేని ప్రఖ్యాత సంస్థలు

కొత్త ఏర్పాటైన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు జవహర్ నవోదయ పాఠశాలు మంజూరు చేయాల్సి ఉంది. భువనగిరిలోని బొమ్మాయిపల్లిలో 120 ఎకరాల్లో సీసీఎంబీ ఏర్పాటు చేస్తామని ఏడేండ్ల క్రితమే ప్రతిపాదలు పంపించినా ఉలుకూ పలుకూ లేదు. ఇక భువనగిరి ఇండస్ట్రియల్ పార్కు, దండుమల్కాపురంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. భువనగిరి–రాయగిరిలో ఎనిమిది లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రతిష్టాత్మక రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్), మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు నిధులు ఇస్తుందో, లేదా చూడాలి.

# అక్రమార్కులకు ఆరోగ్య 'సిరి'



- సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ డబ్బులు గోల్‌మాల్
- శస్త్రచికిత్సల్లో పాల్గొనని డాక్టర్లు, డీపీఓల ఖాతాల్లోకి అక్రమంగా నగదు
- బయట వ్యక్తులకూ చెందుతున్న సొమ్ము

సూర్యాపేట, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : పేదల వైద్య చికిత్స కోసం ప్రభుత్వం ఇచ్చే ఆరోగ్య శ్రీ పథకాన్ని సూర్యాపేటలో అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేసిన డాక్టర్లు, సిబ్బందికి అందాల్సిన నగదు చికిత్సలో పాల్గొనని డాక్టర్ల అక్కౌంట్లలో డబ్బులు జమైనట్లు తెలుస్తున్నది. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేసినా సర్కారు డబ్బులు ఇస్తుంది. అందులో 40 శాతం ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాల్సి ఉండగా, మిగిలిన 60 శాతం నగదును శస్త్రచికిత్సలో పాల్గొన్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందితోపాటు నాలుగవ తరగతి ఉద్యోగులకూ అందిస్తారు. కాగా, ఈ 60 శాతం నగదు ఆపరేషన్లతో సంబంధం లేని డీపీఓలతోపాటు బయటి వ్యక్తుల అకౌంట్లలో కూడా జమమైనట్లు ఆసుపత్రి వర్గాల ద్వారా తెలిసింది.

గత బీఆర్‌ఎస్ హయాంలో మెరుగైన వైద్య చికిత్స అందించడంలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రి ఎంతో పేరు సంపాదించుకున్నది. మాజీ మంత్రి, స్థానిక గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆసుపత్రికి ఏ సౌకర్యం కావాలన్నా వెంటనే వచ్చేది. దాంతో ఈ ఇక్కడ సాధారణ ప్రసవాలతోపాటు పలు విభాగాల్లో చికిత్సలు రికార్డులు సృష్టించాయి. కొవిడ్ సమయంలో జిల్లా నలుమూలల నుంచే నల్లగొండ, జనగాం, హైదరాబాద్‌తో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా అనేక మంది వచ్చి ఇక్కడ చికిత్స పొంది ఆరోగ్యంగా ఇండ్లకు వెళ్లారు. అలాంటిది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆసుపత్రి నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో అక్రమాలు పెరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డాక్టర్లు అందుబాటులో ఉండరు. మందులు ఉండవు. అంబులెన్స్‌లు దొరుకవు. ప్రైవేట్ వ్యక్తులు వచ్చి డాక్టర్ అవతారమెత్తి ఆసత్రిలో హడావిడి చేసినా గుర్తించేవారు లేరు. డబ్బులు తీసుకుని అక్రమ సర్టిఫికెట్లు ఇచ్చేవాళ్లూ తయారయ్యారు. తాజాగా ఆరోగ్య శ్రీ నిధులనూ నకిలీలు దండుకుంటున్నారు.

### సంబంధం లేని వ్యక్తులకు డబ్బులు

సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో సగటున రోజుకు పది నుంచి పదిహేను ఆపరేషన్లు జరుగుతుండగా, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలకు అందే నగదుపై అక్రమార్కులు కన్ను పడింది. అలా సంబంధం లేని వారి అకౌంట్లలోకి డబ్బు బదిలీ అవుతున్నది. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వ దవాఖానలో శస్త్రచికిత్స చేస్తే ఆపరేషన్‌లో పాల్గొన్న డాక్టర్లకు 35శాతం, స్టాఫ్ నర్సులకు 10, పారామెడికల్ సిబ్బందికి 10శాతం, నాలుగో తరగతి ఉద్యోగులకు 5 శాతం బిల్లు చెల్లిస్తారు. ప్రతి ఆరు నెలలు లేదా ఏడాదికో సారి ఈ నిధులు వస్తాయి. సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో మాత్రం శస్త్రచికిత్సల్లో పాల్గొనని డాక్టర్లతోపాటు అసలు ఏ సంబంధమూ లేని డీఏఓల అకౌంట్లలో రూ.8వేల నుంచి 35వేల వరకు జమయ్యాయి. ఒక డీఏఓ అకౌంట్లో రూ.35వేలు పడగా, ఆయన భార్యకు, డిపార్ట్‌మెంట్‌కు సంబంధం లేని బావమరిదికి రూ.14వేల చొప్పున అందాయి. బయటి వ్యక్తుల అకౌంట్లలోనూ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వేసినట్లు ఆసుపత్రి వర్గాల ద్వారా తెలిసింది.